ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 16 ఆగస్ట్ 2024 www.prajaaswaramdaily.com 3 PM

# గచ్చిబౌలిలో డ్రగ్స్ కలకలం

## రాజస్థానీ గ్యాంగ్ అరెస్ట్

### రూ.4.34 కోట్ల విలువైన 620 గ్రాముల హెరాయిన్ స్వాధీనం


ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :

హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా చేస్తున్న రాజస్థానీ గ్యాంగ్‌ను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గచ్చిబౌలిలో తనిఖీలు చేస్తుండగా డ్రగ్స్ తరలిస్తున్న స్మగ్లర్లు పట్టుబడ్డారు. నిందితుల దగ్గర 620 గ్రాముల హెరాయిన్ దొరికిందని, దాని విలువ మార్కెట్‌లో రూ.4.34 కోట్లు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి సమూలంగా నిర్మూలించేందుకు టాస్క్ ఫోర్స్, ఎస్‌వోటీ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, ఎయిర్ పోర్టులతో పాటు ప్రధాన కూడళ్లలోనూ సోదాలు చేస్తున్నారు. వాహనాలను, అనుమానితులను ఆపి తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఎస్‌వోటీ పోలీసులు గచ్చిబౌలిలోని టెలికాంనగర్‌లో నిర్వహించిన సోదాల్లో డ్రగ్ స్మగ్లర్లు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. రాజస్థాన్ నుంచి నగరానికి డ్రగ్స్ రవాణా చేసిన ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో నలుగురు రాజస్థాన్ కు చెందిన వారని తెలిపారు.



# విలీనం ఖాయం

## బీజేపీతో బీఆర్ఎస్ ఒప్పందం




**కేసీఆర్ గవర్నర్..**
**కేంద్ర మంత్రిగా కేటీఆర్**
**కవితకు బెయిల్..**
**ఆపై రాజ్యసభకు**
**అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా హరీశ్‌రావు**
**సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :

అతి త్వరలో బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేయడం ఖాయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. త్వరలోనే బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందన్నారు. కేసీఆర్‌కు గవర్నర్ పదవి, కేటీఆర్‌కు కేంద్ర మంత్రి పదవిని బీజేపీ ఇస్తుందని తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా హరీశ్ రావు నియమితులవుతారన్నారు. లిక్కర్ స్కామ్ కేసులో తీహార్ జైలులో ఉన్న కవితకు బెయిల్ కూడా వస్తుందన్నారు. విలీనంలో భాగంగా ఆమెను రాజ్యసభకు పంపుతారన్నారు. బీఆర్ఎస్‌కు నలుగురు రాజ్యసభ సభ్యులు ఉన్నారని, వీరి అవసరం బీజేపీకి ఉందన్నారు. రేవంత్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ పాలిటికల్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్‌గా మారాయి.





## ఎస్ఎస్ఎల్‌వీడీ3 ప్రయోగం

# విజయవంతం

ప్రజా స్వరం, ఏపీ బ్యూరో :

ఇస్రో చేపట్టిన మరో ప్రయోగం విజయవంతమైంది. శుక్రవారం ఉదయం నెల్లూరు జిల్లా శ్రీహరికోట నుంచి ఎస్ఎస్ఎల్వీ డీ 3 రాకెట్‌ను ఇస్రో నింగిలోకి పంపింది. షార్‌లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ఈ వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం ద్వారా 175 కిలోల ఈవోఎస్08 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. చిన్న చిన్న శాటిలైట్లను అభివృద్ధి చేయటం, అందుకు అనుకూలమైన పేలోడ్ పరికరాలను రూపొందించే లక్ష్యంలో భాగంగా ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. విపత్తు నిర్వహణలో సమాచారం ఇచ్చేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. పర్యావరణం, ప్రకృతి విపత్తులు, అగ్ని పర్వతాలను ఇది పర్యవేక్షించనుంది. ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈవోఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ పేలోడ్ మిడ్‌వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రారెడ్‌లో చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలను ఇస్రో ఛైర్మన్ అభినందించారు. దాదాపు ఆరు నెలల తర్వాత ఇస్రో రాకెట్ ప్రయోగాన్ని చేపట్టింది. కేవలం రెండు రోజుల ప్రణాళికతో చిన్న చిన్న శాటిలైట్స్‌ను తక్కువ ఖర్చుతో భూ కక్ష్యలోకి చేర్చేందుకు ఎస్ఎస్ఎల్వీడీ3 రాకెట్‌తో సాధ్యమవుతుందని ఇస్రో మాజీ సైంటిస్టు ఒకరు చెప్పారు.

## హరీశ్‌రావు.. దమ్ముంటే రాజీనామా చేయ్

### నగరంలో మైనంపల్లి అభిమానుల పేరుతో ఫ్లెక్సీల ఏర్పాటు

ఇదే నిజం, తెలంగాణ బ్యూరో :

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు రాజీనామా చేయాలంటూ హైదరాబాద్‌లో శుక్రవారం ఉదయం పలు చోట్ల ఫ్లెక్సీలు వెలిశాయి. ఆగస్టు 15లోపు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని గతంలో హరీశ్‌రావు ప్రకటించారు. తుదివిడత రూ.2 లక్షల రుణమాఫీకి నిధులు విడుదల చేసిన సందర్భంగా హరీశ్ రాజీనామా అంశాన్ని సీఎం రేవంత్ గురువారం వైరాలో నిర్వహించిన సభలో ప్రస్తావించారు. దీంతో రుణమాఫీ అయిపోయే నీ రాజీనామా ఏడబోయే.. అంటూ ఫ్లెక్సీల్లో హరీశ్‌రావును ప్రశ్నించారు. ఫ్లెక్సీలను మైనంపల్లి అభిమాన దళం పేరిట ఏర్పాటు చేశారు.






# ఎమ్మెల్సీలుగా

## కోదండరామ్, అమీర్ అలీఖాన్

### గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా బాధ్యతలు

ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో :

ప్రొఫెసర్ కోదండరామ్, జర్నలిస్ట్ ఆమిర్ అలీఖాన్ లు ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ కోటాలో వీరిద్దరూ ఎమ్మెల్సీలుగా బాధ్యతలు చేపట్టారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వీరిచేత ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్, విప్ బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేసిన కోదండరామ్, అలీఖాన్ లకు పలువురు రాజకీయ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

# అక్క చెల్లెమ్మలను కించపరిచే ఉద్దేశం లేదు

## మహిళలపై చేసిన వ్యాఖ్యలపై విచారం
## విమర్శలు వెల్లువెత్తడంపై కేటీఆర్ ట్వీట్

ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలపై చేసిన వ్యాఖ్యలపై వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఇటీవల కేటీఆర్ 'బస్సుల్లో కుట్లు అల్లికలే కాదు, అవసరమైతే బ్రేక్ డ్యాన్సులు చేసుకున్నా మాకు అభ్యంతరం లేదు' అంటూ మహిళలపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతుండటంతో కేటీఆర్ స్పందించారు. 'గురువారం పార్టీ సమావేశంలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యల వల్ల మా మహిళా సోదరీమణులకు మనస్తాపం కలిగితే, నేను విచారం వ్యక్తం చేస్తున్నాను. నా అక్కచెల్లమ్మలను కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదు' అని తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా కేటీఆర్ దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చింది. మహిళల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది. దీనిపై విచారణ జరపాలని ఆదేశించింది. ఆయన వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని కమిషన్ చైర్ పర్సన్ పేర్కొన్నారు.

